# అన్ని మతాల వారిని ఆదరిస్తున్నాం

- ప్రార్థన మందిరాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబర్ 8: కులమతాలకు అతీతంగా బీఆర్‌ఎస్ పాలన నడుస్తున్నదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ 113లోని శాంతినగర్ కాలనీలో మెథడిస్టు చర్చి పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం ముఖద్వారం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరులో ఉన్న పురాతన చర్చిల్లో మెథడిస్ట్ చర్చి ఒకటన్నారు. చర్చి పునర్నిర్మాణ పనులకు గతంలో రూ. 20లక్షలు విరాళంగా ఇచ్చామని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ప్రార్థన మందిరాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందజేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ అర్హులైన క్రిస్టియన్లకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కుల మతాలకు అతీతంగా సీఎం కేసీఆర్ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, సీనియర్ నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

**పీఆర్‌టీయూ భవనానికి 500 గజాల స్థలం**

పీఆర్‌టీయూ భవన నిర్మాణం కోసం నియోజకవర్గంలో 500 గజాల స్థలాన్ని అందజేస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని ముదిరాజ్ సంఘం భవనంలో జరిగిన పీఆర్‌టీయూ జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయ రంగానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు. పీఆర్‌టీయూ సంఘం భవన నిర్మాణానికి 500గజాల స్థలం త్వరలో కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎప్పటికప్పుడు టీచర్ల సమస్యలు, బాధలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఉపాధ్యాయులకు అండగా ఉంటున్నారని కొనియాడారు. 500 గజాల స్థలం అందజేయడంపై ఉపాధ్యాయుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, చెన్న కేశవరెడ్డి, లక్ష్మణ్, కమలాకర్, రవీందర్, ప్రభు, మదన్, గోపాల్ పాల్గొన్నారు.

**శ్రీకాకుళం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

శ్రీకాకుళం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన శ్రీకాకుళం సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని 28రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారన్నారు. ఉపాధికోసం పొట్టచేత పట్టుకుని వచ్చిన వారికి సురక్షితమైన ప్రాంతం పటాన్‌చెరు అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరూ తెలంగాణ బిడ్డలేనన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో పక్షపాతం చూపకుండా పారదర్శకంగా పంపిణీ చేశామన్నారు. రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందున్నదన్నారు. గతంలో శ్రీకాకుళం సంక్షేమ సంఘానికి సొంత నిధులతో 500 గజాల స్థలం ఇచ్చామన్నారు. రెండు రోజుల్లో భవన నిర్మాణ పనులను సైతం ప్రారంభిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. తెలుగు రాష్ట్రాల ప్రజలను సోదరులుగా గుర్తించి అక్కున చేర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి, సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు సాయితేజ, అధ్యక్షుడు యోగేశ్, భాస్కర్, సురేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న చర్చి ప్రతినిధులు



ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీకాకుళం అసోసియేషన్ నాయకులు

## దసరాకు ముందుగానే బోనస్‌లు చెల్లించాలి

జిన్నారం, అక్టోబర్ 8 : పరిశ్రమల్లో పని చేసే కార్మికులందరికీ దసరా పండుగకు ముందే బోనస్‌లు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో సీఐటీయూ క్లస్టర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ జిన్నారం మండలంలోని అన్ని పరిశ్రమల్లో పని చేసే పర్మినెంట్, కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులందరికీ బోనస్‌లు దసరాకు ముందుగానే చెల్లించాలన్నారు. బోనస్‌లు చెల్లించని పరిశ్రమల ఎదుట ఆందోళన చేస్తామన్నారు. కార్మికులకు అండగా పోరాడాతమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీధర్‌రావు, భాస్కర్ రెడ్డి, శేఖర్, రవి, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య

## ఆయుష్మాన్‌భవ దరఖాస్తు పూర్తిగా ఉచితం

గుమ్మడిదల, అక్టోబర్ 8 : ఆయుష్మాన్‌భవ దరఖాస్తులు పూర్తిగా ఉచితంగా నమోదు చేసుకోవచ్చని గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గుమ్మడిదల మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల పలు ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకులు ఫీజులు చార్జీలతో ఆయుష్మాన్‌భవ దరఖాస్తులు నమోదు చేస్తున్నట్లు మండలప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వారి వారి పరిధిలో ఉన్న ప్రాథమిక ఉపకేంద్రాల్లో దరఖాస్తులను పూర్తిగా ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇందు కోసం ఆధార్‌కార్డు లింక్ మొబైల్ నంబర్ ఉంటే సరిపోతుందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఊట్లలో దోబీ ఘాట్ నిర్మాణ పనులు ప్రారంభం

జిన్నారం, అక్టోబర్ 8 : మండలంలోని ఊట్ల గ్రామంలో దోబీ ఘాట్ నిర్మాణ పనులను ఆదివారం రజక సంఘం సభ్యులతో కలిసి గ్రామ ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గతంలో దోబీ ఘాట్ నిర్మాణ పనులకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు మాజీ సర్పంచ్ జింకల శివరాజ్ తెలిపారు. సుమారు రూ. 4లక్షలతో దోబీఘాట్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. పనులు త్వరలోనే పూర్తిచేసి దోబీ ఘాట్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. దోబీఘాట్ నిర్మాణం చేసేందుకు రజకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ గంగురమేశ్, ఉపసర్పంచ్ రవీందర్, మాజీ సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, గోవిందరాజు, గ్రామ పెద్దలు జహంగీర్‌రెడ్డి, నందకుమార్, వార్డు సభ్యులు దొమ్మ సురేశ్, పూజారిశ్రీకాంత్, మోతే మహేశ్, బొగురు లక్ష్మణ్, నాయకులు మహేందర్‌రెడ్డి, పూజారిరాజు, విష్ణు, ఎంకిరిగారి రవి, బుషిగారిక్రిష్ణ, బొగురు రాజు, విట్టు, మహేశ్‌యాదవ్, రజక సంఘం నాయకులు వీరయ్య, యాదయ్య, మల్లేశ్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



ఊట్లలో దోబీఘాట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

## కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడులు

బొల్లారం, అక్టోబర్ 8: పారిశ్రామికవాడలోని కోడిపందాల స్థావరంపై మేడ్చల్ డివిజన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీలోని శ్రీరామ్‌నగర్‌లో కోడి పందాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు మెరుపు దాడు లు చేశారు. పెద్ద ఎత్తున కోడి పందాలు నిర్వహిస్తున్న 53మంది వ్యక్తులను ఎస్‌ఐలు రోహిత్‌కుమార్, ధనుంజయ్‌ని అదుపులోకి తీసుకున్నా రు. వారి వద్ద నుంచి రూ. లక్షా32వేలు నగదు, 49 సెల్‌ఫోన్లు, 6 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు, పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడుల్లో ఎస్‌ఓటీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు

## చింతా ప్రభాకర్‌ను ఆశీర్వదించండి

సదాశివపేట, అక్టోబర్ 8: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్‌ను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని 15గ్రామాల్లో పర్యటించి యువకులకు లర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతనిధులతో యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేస్తున్నారని గుర్తు చేశారు. నియోజవకర్గంలో ఇప్పటి వరకు 6వేల మందికి లర్నింగ్ లైసెన్స్ అందజేశామన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయా గ్రామాల యువకులు చింతా ప్రభాకర్‌కే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు, ప్రధా న కార్యదర్శి ఆరిపొద్దీన్, ఎంపీటీసీలు సత్యనారాయణ, సునీతాసుధాకర్, అల్లం లలిత, సంతోష్‌గౌడ్, సర్పంచ్‌లు విజయలక్ష్మి, భానుప్రకాశ్, శ్రీహరి, నరేశ్‌గౌడ్, సలావొద్దీన్, శేఖర్, నగేశ్, సొసైటీ వైస్ చైర్మన్ పాండునాయక్, ఏఎంసీ డైరెక్టర్లు కరుణాకర్, ఆరీఫ్, మా జీ ఎంపీటీసీలు శివకుమార్, మాణయ్య, మాజీ సర్పంచ్ మాణిక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



లర్నింగ్ లైసెన్స్ అందజేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్

**ఆపదలో ఆదుకునే నాయకుడు సీఎం కేసీఆర్**

ఆపదలో ఆదుకునే నాయకుడు సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్ అన్నారు. ఆదివారం టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో రూ. 9,88,500లక్షల విలువ గల 31సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, చౌదరి ప్రకాశ్, గుండురవి, కో ఆప్షన్ సభ్యుడు ఖలీంపటేల్, నాయకులు ఉన్నారు.

## మహాసభల కరపత్రం ఆవిష్కరణ

జిన్నారం, అక్టోబర్ 8 : ఏఐఎస్‌ఎస్‌డీ (ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్) తెలంగాణ రాష్ట్ర 10వ మహాసభల కరపత్రాలను మండల కేంద్రం జిన్నారంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్ సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 15న హైదరాబాద్ సైఫాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ హాల్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి ఏఐఎస్‌ఎస్‌డీ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు.

## బాధితులకు అండగా పీఎన్ ఫౌండేషన్

రామచంద్రాపురం, అక్టోబర్ 8 : కరెంట్‌షాక్ బాధితులకు పీఎన్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆర్సీపురం డివిజన్‌లోని 3వ బ్లాక్‌లో నివాసం ఉండే మోయిన్ ఇంట్లో శనివారం అగ్నిప్రమాదం సంభవించి గృహోపకరణాలు దగ్ధం అయ్యాయి. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు బూరుగడ్డ నగేశ్, పీఎన్ ఫౌండేషన్ చైర్మన్ బూరుగడ్డ రాకేశ్‌రాజ్ ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేలు, 50కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎన్ ఫౌండేషన్ ద్వారా పేదలకు తమవంతు సహాయసహకారాలను అందజేస్తుందన్నారు. పేదలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్, సజ్జకుమార్, సజ్జయాదయ్య, సురేశ్ పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పీఎన్ ఫౌండేషన్ చైర్మన్ రాకేశ్‌రాజ్

## నేడు మంభాపూర్‌కు ఎమ్మెల్యే రాక

గుమ్మడిదల, అక్టోబర్ 8 : మండలంలోని మంబాపూర్‌లో గౌడ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఎమ్మెల్యే హాజరుకానున్నారని సర్పంచ్ తెలిపారు. సోమవారం మంబాపూర్ గ్రామంలో ఉదయం 9:30గంటలకు గౌడ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరుకానున్నారని సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్దిప్రవీణా విజయభాస్కర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మంజుల వెంకటేశ్‌గౌడ్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.